# పుస్తకాలు - పుస్తకాలు

మనసులో బాధ ఎలా చెబితే తీరుతుందో, అసలు ఏంచేస్తే తీరుతుందో తెలియడంలేదు- మనసులో భయం అయితే లేకపోలేదుకాని ఇది ఇలా ఈ రూపంలో విరుచుకు పడుతుందని కలలో కూడా అనుకోలేదు- ఏం చేయాలి? ఎలా చేయాలి?

ఆమె మూర్తీభవించిన విషాదంలా మాత్రమేలేదు. విసిగి వేసారిపోయిన రోసంలాగ, ఎంతకోపం తెచ్చుకొని కూడా ఏమీ చేయలేని నిస్సహాయత లోంచే మహోధృతంగా పెల్లుబుకుతున్న కోపంలాగా ఉంది .

ఆమెకళ్లు ఎర్రగా, చాలాచాలా ఎర్రగా ఉన్నాయి. దుఃఖంతోనా కోపంతోనా?

ఆమె నిలువెల్లా కంపించుపోతున్నది. దుఃఖంతోనా కోపంతోనా ?

ఆమె ముక్కుపుటాలు ఎగురుతున్నాయి భరించరాని దుఃఖంతోనా? పట్టరాని కోపంతోనా?

దుఃఖం ఎవరికోసం ? కోపం ఎవరిమీద?

నిస్సహాయత,రోషం ఎందుకు.......? ఎందుకు.......?

ఆమెకు 60 ఏళ్లుదాటి ఉండవచ్చు. ఇంకొంచెం ఎక్కువకూడా ఉండొచ్చు. పచ్చగా పరువంతో మెరిసిపోయిన జాంపండు, బాగా ఎక్కువకాలం నిలవుండిపోయి మాగిపోయినట్టు ఆమె శరీరం మాగి పోయింది. మాజీ పచ్చదనంవుంది. తలనెరసి, చీరవెలసి ఉంది.

ఎంతసేపటినుంచి బాధల పొగలు వెళ్లగక్కుతోందో కంఠం జీరబోయింది. జీరబోయిన కంఠానికి సమీపంలో ఓ అమ్మాయి కూచుని ఉంది. ఆగని అమ్మమ్మ దుఃఖాన్ని చూస్తున్న అమ్మాయి కళ్లల్లో కూడా కన్నీటి జీరవుంది.

“ఇంటినిండా ఎక్కడబడితే అక్కడ గుట్టలు గుట్టలుగా పోగులుపడివున్న ఈ పుస్తకాన్ని నేనేంచేసుకోను? ఎవరు వీటికి కాపలా నేను మొత్తుకొంటూనేవున్నాను ఈ గుట్టలకీ ఈ పుట్టలకీ నేను కాపలా ఉండలేనుబాబోయ్ అని నెత్తీనోరూ బాదుకుంటూనే ఉన్నాను. ససేమిరా నామాటవింటేనా? ఓ బంగారం ఉంటే అమ్ముకోవచ్చు ఓ సామాన్లు ఉంటే అమ్ముకోవచ్చు, పోనీ తలా ఒకటి పంచుకోవచ్చు ఈ దిక్కుమాలిన పుస్తకాలు, నానోరు తిన్నగారాదుగాని, ఈ పెంట పోగుల్ని ఏం చేసుకోవడం? ఎవడికి తెలుసు వీటి సంగతి, ఎవడు హర్షిస్తాడు .... ?

ఆ అమ్మాయి ఏదో అనబోయి ధైర్య చేయలేకపోయింది. అమ్మమ్మ కళ్లు కంటితో చూస్తేనే కాల్తాయేమోనన్నంత ఎర్రబడ్డాయి . ఇంతసేపూ వంచినతల నిటారుగా నిలబెట్టింది. అంతా నిశ్చయం అయిపోయినట్టు అలా చేసి తీరతానన్నట్టు తల నిలబెట్టింది.

“ నా కట్టే మండిందంటే ఇంత కిరసనాయలు పోసి అగ్గిపుల్ల గీసేస్తాను విరగడయిపోతుంది పెంట. ఆతరువాత నేనూ కిరసనాయిలు పోసుకొని తగలబెట్టుకొని ఛస్తాను.....”

అమ్మమ్మా వూపునలేచి నిజంగానే అలా చేసేస్తుందేమోనని ఆపిల్ల భయపడి పోయింది. ఆ పిల్ల గుండెల్లాగే కళ్లుకూడా ఒక్కక్షణం టపటపా కొట్టుకున్నాయి. అలాంటిమాట ఇంతకుముందు వినకపోలేదు. తాతయ్య పోయాక ఈ నెలరోజులలోనే నాలుగయిదు సార్లు విన్నది. ఎప్పటికప్పుడు భయం భయం భయమే. సెలవులుకనుక తాననవసరంగా ఇక్కడ చిక్కుకు పోయానని నొచ్చుకుందాఅమ్మాయి.

“ అమ్మమ్మా ఊరుకో - ” అందామనుకుంది. కానీ దుఃఖమే ఎక్కువవుతుందో తిట్లే ఎక్కువవుతాయోనని ..... భయం.

చాలా సేపుగడిచింది. బయిట ఇంకా వెలుతురుంది. తీసివున్న తలుపుల్లోంచి రివ్వున రివ్వున లోపలికి రాబోయిన గాలి జంకి వెనక్కి వెళ్లి పోయింది. డాబా ఎక్కితే చేతికి అందేంత దూరంలో నున్న ఉత్తర కేబిన్ దగ్గర ఏదో రైలాగి ఎలమంచిలి స్టేషన్ వైపు బయలు దేరినట్టుంది. ముందురోజు రాత్రి చాలా పెద్ద వర్షం పడటంవల్ల వాతావరణ చల్లగా బాగానే ఉంది. అంతగా ఉక్క బోయడంలేదు.

" ఈ ఇల్లు చూడు ఎలా కట్టించారో? ఒక అద్దెకు ఇచ్చుకోడానికి పనికిరాదు. ఇంతపెద్దహాలు దేనికి ? ఏ కథో కార్యమో జరిగినా పదిమంది గుమ్మంలోకి వచ్చినా -" దుఃఖం, కోపం.

" ..... పనికి రాకుండా. చుట్టూ బీరువాలనిండా పుస్తకాలు ! కూచోడానికి అవసరమయితే పడుకోడానికి చేయించుకొన్న బల్ల. ఆబల్ల కింద పుస్తకాల గుట్టలు. టేబిల్ నిండా పుస్తకాలు, టేబిల్ పక్కనున్న బీరువానిండా రకరకాల డిక్షనరీలు - ఇంకా ఏవోవో పెద్దపెద్ద పుస్తకాలు అట్లాసులు - గోడలనిండా దేశపటాలు, ప్రపంచ పటాలు. కాపరాని కొచ్చిందగ్గిరినుంచి దేవుడు పటాలు ఆయిన పెట్టడం చూడలేదు పోనీ ఓగాంధీ గారి ఫొటోనో, నెహ్రూగారి ఫొటోనో ఉంటే పోన్లే దేశనాయకులవని అయినా సంతోషిద్దును.'

" ఆ గురజాడ అప్పారావు పటందేనికి ! అతనేమన్నా మనతండ్రా, తాతా ! కనీసం కులమా!" అని అడిగితే అంత ఎత్తున లేచారు ఒకసారి. బరంపురం మీటింగుల్లో శ్రీశ్రీ తో ఫొటో, ఆ బరంపురంలోనే మరోఫ్రెండ్ తో ఫొటో - ఏం రాజో మర్చిపోయాను."

" చెరబండరాజు " అని అందించింది అమ్మాయి

" ఆ- ఆ తరువాత ఇంగ్లీషువాళ పోటోలు -. ఆ తరవాత.......?

" మార్క్స్ ఏంగిల్స్....... అని కొన్ని పేర్లు చెప్పింది మనుమరాలు

" ఎందుకవన్నీ ....... ! ఆ ఎందుకు చెప్పు? మీ అమ్మా నాన్నల పటాలు, మా అమ్మానాన్నల పటాలు పెట్టమంటే వినలేదు- అంతెందుకు మా ఇద్దరి ఫొటో కూడాలేదు - ఆ పక్కగది నిండా పత్రికల కట్టలు- చదివి పారేసే పేపర్లు అన్నీ సంవత్సరాల వారీగా పేర్చి పెట్టారు. ఒకసారేం జరిగిందనుకొన్నావు - నువ్వు పుట్టిన కొత్తలో గావును పిండి జల్లిద్దామనుకొని ఒక పేపరు మధ్య కాగితం తీశాను ఆదివారం పేపరు కాదని రూఢీ తీసుకొని మరీ తీశాను. పనంతా పూర్తయి ఆపేపరు పారేద్దామనుకుంటుండగా - పెద్దగొడవ, అదేవడిదో వర్ధంతి సభట. ఎందరెందరో మహానుభావులు దాన్లో పాల్గొన్నారట. విశేషాలన్నీ ఫొటోల్తోసహా ఉన్నాయట. దులిపి ఆరబెట్టి దాచారు. వర్ధంతి అంటే సంవత్సరీకమో తద్దినమో అన్నమాట.

అమ్మమ్మ మాటలకి నవ్వబోయి ఆగింది మనమరాలు కానీ అమ్మమ్మ మీద కోపంగా వుంది. పుస్తకాల్ని పెంటకుప్పలనొద్దని. మహానుభావుల్ని పట్టుకొని వాడూ, వీడు అనొద్దని ఎన్ని సార్లు చెప్పినా వినదు. కోపం, ఉక్రోషం,పంతం ఎక్కువ అమ్మమ్మ చదువురానిది కాదు పాత సాంప్రదాయాలంటే ఇష్టం తాతయ్య భావాలంటే తగని కోపం. ఆయిన తనను మార్చెయ్యబోతున్నారని ఏవోవో నూరి పోస్తున్నారని వినకూడదని మారకూడదని ఆమె పట్టుదల. అందుకే అమ్మమ్మ ఇలా తయారయ్యిందని మనవరాలకి తెలుసు. తనకి తెలియని సంగతులు తల్లిద్వారా, పిన్నిద్వారా విన్నది. ఈ ఇరవై ఏళ్ల వయస్సు లోనూ తాతగారి భావాల్ని పనితీరును చూసింది. తాతయ్యగారు పై ఆదాయం లేని కాలేజీ లెక్చరరు ఎంతోడబ్బు ఆదాయం పన్నుగా తిరిగి ప్రభుత్వానికి కట్టవలసిన పరిస్థితి.

ప్రభుత్వోద్యోగం వల్ల బదిలీలు అనారోగ్యాలు ఇన్ని పరిస్థితుల మధ్య సాహిత్యం, ఆర్థిక శాస్త్రం రాజకీయం, తత్వశాస్త్రం, విజ్ఞానశాస్త్రం, చిత్రకళ, వైద్యశాస్త్రం - ఇన్ని విషయాల్ని అధ్యయనం చేశారు. తెలుగు, ఇంగ్లీషు, సంస్కృత భాషల్లో పెద్ద ఎత్తున గ్రంధాలు కొన్నారు, చదివారు.

తన గురువుగారిలాగా ఫ్రెంచి, జర్మన్, స్పానిష్, ఇటాలియన్ మొదలైన భాషలు నేర్చుకోలేదని మొదట్లో నొచ్చుకునేవారట. విజ్ఞానం తలబరువు కాకూడదన్న అవగాహనతో ఆ పని మాని ప్రగతిశీల

భావప్రచారానికి నడుం కట్టారు ఒక నెలరోజుల్లో చనిపోతారనగా కూడా బెజవాడ బుక్ ఎగ్జిబిషన్ కు వెళ్లి పుస్తకాలు కొనుక్కొచ్చారు. ఎందరెందరో విద్యార్థులు రిసర్చ్ స్కాలర్లు ఆయనకోసం వచ్చేవారు. బెజవాడలో కొన్న పుస్తకాలు తాను చదవలేకపోతానని బహుశా తెలిసే ఉంటుంది. కానీ చదవాలని తపించారు. ఎక్కడలేని కరపత్రాలు సేకరించి వాటిని పుస్తకాలుగా బైండ్ చేసి భద్రపరిచారు. చిన్నప్పటినుంచీ బహుశా కాలేజీ రోజులనుంచి డైరీలు వ్రాసే అలవాటుంది సమకాలిక సంఘటనలకి రికార్డులనదగిన ఆ డైరీలను దాచారు. ఏ పుస్తకం ఏపత్రిక కావాలన్నా వెంటనే తీయగలిగినంతబాగా పేర్చారు ఏబీరువాల్లో ఉన్న పుస్తకానికి సంబంధించిన విషయాలన్నీ వివిధ పత్రికలని ఆ బీరువాల తలలమీద పేర్చారు. స్థలంలేక దుమ్ముపడకుండా కొన్ని పత్రికలని తను పడుకునే బల్లకింద దాచారు. గత నాలుగయిదు సంవత్సరాల పత్రికలివి .

డాబా మీద ఒక్కగదిఉంది మిగతా అంతా కేవలం స్థంభాలమీద నిలబడిన హాలు. గోడలులేవు. చుట్టుప్రక్కలప్రాంతాల యువతీ యువకుల్ని చేర్చి అక్కడే సమావేశాలు ఏర్పాటు చేసేవారు పత్రికలు చదివించేవారు, కరపత్రాలు చదివించేవారు. ఆయన ఒక ఉద్యమకేంద్రంగా ఉండేవారు. తానూ అనేక ప్రాంతాల్లో కార్యక్రమాల్లో పాల్గొనేవారు.

ఇంటిని అద్దెకు ఇవ్వడానికి వల్లగాకుండా కట్టినమాట ఒకరకంగా నిజమే. రేపొద్దున్న అమ్మ, పిన్ని ఈ ఇంటిని వాటాలు వేసుకోవాలంటే కుదరదు.

" పోనీ వంటి ఆరోగ్యం ఏమన్నా చూసుకొన్నారా"

మళ్లీప్రారంభించింది అమ్మమ్మ

" అదీలేదు వైద్య గ్రంధాలు కొని చదివి స్నేహితుల్తో చర్చించి అప్పుడు మందులు వేసుకొనేవారు. డాక్టర్లలో ఎక్కువమంది పచ్చి వ్యాపారులట ఖరీదులైన మందులూ టానిక్కులు కొనేవారు కాదు. ఖరీదయిన బట్టలు కూడా కుట్టించుకునే వారు కాదు. నాకు కొనేవారు కాదు. ఎక్కడలేని డబ్బూ పుస్తకాలకీ, మీటింగులకు తిరగడానికీ చాలేది కాదు. ఎప్పుడో కొన్న స్థలం యిది. ఈ మాత్రం ఇల్లయినా కట్టారు. బంధువులెవరూ రాలేదు, ఈ ఇంట్లో దిగినపుడు. బాబాల్ని తిట్టేవాడు. తిరుపతి వెంకన్న నుంచీ, అన్నవరం సత్యనారాయణ స్వామి వరకూ ఏయే దేవుడిగుడి ఎప్పుడెప్పుడు ఎలా కట్టారో చెప్పేవారు. ఆయన్ని అన్న దమ్ములే తిట్టారు. అప్ప జెల్లెళ్ళే తిట్టారు. నాస్తికు డన్నారు. కమ్యూనిస్టన్నారు. కులం లేనివాడన్నారు. తల్లీ తండ్రి పోతే కర్మ చెయ్యనని ఎంత గొడవ ఎంత గొడవ"

"తనకూ అలాంటి కర్మకాండలేంచెయ్యొద్దన్నారు కదా" అని అందుకుంది మనుమరాలు.

"చెబితే మీరంతా పోగయి అలా చెయ్యడమేనా?" ఉగ్రురాలయి పోయింది. కర్మచేసి పిండం పెట్టకపోతే పోయిన ప్రాణానికి ఆత్మశాంతి ఏది? మనల్ని ఆ పాపం పట్టికుడపదూ-" కోపం దుఃఖంలోకి దిగింది. అమ్మమ్మ ఉద్దేశాలు మనుమరాలికి బాగా తెలుసును. "చక్కగా అద్దెలకి ఇచ్చుకోవడానికి వీలుగా ఇల్లు కట్టుకోవాలి. కులం, గోత్రంచూసి, పిల్లలకి పెళ్ళిళ్ళు చేసుకోవాలి. కులంలోనూ, బంధువుల్లోనూ సెభాష్ అనిపించికోవాలి. మా నాన్న మాకేం ఇవ్వలేదని పిల్లలు బాధపడ కూడదు. ఎందుకొచ్చిన ఆదర్శాలు, ఎందుకొచ్చిన ఘోరాలు...." ఇలా సాగుతుంది ధోరణి.. "నాకే ఈ యింటి మీద ఎంత హక్కుందో తెలియడంలదు," అని ఆ తరువాత ఒళ్ళు మండింది గావును, చాలా ఘోరమైన మాట అన్నది. ఒకసారి.

ఈ యింటి పెద్దకూతురు, మనమరాలి తల్లి ఆ మాట విని, " నీకు హక్కు లేకపోవడం ఏయిటి? ఉన్నన్నాళ్ళూ ఈ యిల్లు నీదే, నీకు పెన్షన్ వస్తుంది" అన్నది.

"ఇంటినిండా పుస్తకాల పోగులు పెట్టుకుని ఏంచేసుకోను, ఈ ఇల్లునేను. ఎక్కడికన్నా పోదామన్నా వీల్లేకుండా ఈ ఛండాలానికి నేను కాపలా కాస్తూ కూచోవాలా" అనా విరుచుకు పడింది.

అమ్మమ్మమనసులోనూ, మనుమరాలి మనసులోనూ ఆలోచనలు మళ్ళు తిరుగుతున్నాయి.

"ఊరుకో అమ్మమ్మా, తాతయ్య శిష్యులూ, మిత్రులూ దీన్ని లైబ్రరీలాగ తీర్చిదిద్దుతారు. ఒకాయన తాతయ్య గురించి పుస్తకం రాస్తానని ఉత్తరం రాశాడు. చూశావు కదా, మవ్వు చక్కగా ఈ ఇంట్లోనే వుండు. బోలెడు కీర్తిప్రతిష్ఠను నమ్మకమైన వ్యక్తినినీకు తోడుగా వుంచుతాం-"

"పళ్లురాలగొడతానే మనుకుంటున్నవో"- "ఉగ్రు రాలయింది అమ్మమ్మ. "నమ్మకమైన వ్యక్తిని తోడుగా వుంచే బదులు నువ్వే వుండరాదూ? నాకూతుళ్ళూ, మనవలూ నా కళ్ళ ఎదురుగా వుండాలిగాని ఎవరో తోడెందుకూ? నీకేమన్నా మతి వుండే మాట్లాడుతున్నావా? మీతాతయ్య మీ అమ్మకూ మీ పిన్నికీ పెళ్లిచేసినటు నీకు చెయ్యనివ్వను లక్షణంగా తాళికట్టించి మంత్రతంత్రాలతో వైభవంగా పెళ్లి చేస్తాను."

ఎక్కడ మొదలు పెట్టి ఎక్కడ మాట్లాడుతుందీ అమ్మమ్మ? ఆచరణవున్నా ఒకొక్క సారి భార్యని భర్త, భర్తని భార్యా ప్రగతి శీలభావాలవేపు మార్చలేక పోయిన కథ ఒకటి మనుమరాలు ఈమధ్య విన్నది, చూసిందికూడా. తరతరాలు సంప్రదాయ భావాలతో పెరిగిన వారు ఒక్కతరంలో మారకపోగా మార్చబోయినకొద్దీ మరింత సాంప్రదాయ వాదులుగా తయారయ్యే ప్రమాదం లేక పోలేదు.

పాత భావాలు సాంప్రదాయభావాలుగల తల్లిదండ్రులు పిల్లలకి ఎవరైనా ఇస్తే తినొద్దని ఎవరైనా ఏదైనా కొత్తవిషయం ముఖ్యంగా సాంప్రదాయానికి వ్యతిరేకమైనది చెబితే వినొద్దని నూరిపోస్తారు. అమ్మమ్మ ఆ వాతావరణంలో పెరిగింది కనుక ఆమె తాతయ్యతో జీవితాంతం పోరాడింది తప్ప ఎంతమాత్రం మారలేదు. పైగా ఆయన భావాలపై పనులపై పుస్తకాలపై కక్ష పెంచుకొంది. తాతయ్య పరిచయాలువేరు. ఆ పరిచయాల్ని ఆయన కొంతవరకూ పెంచుకోగలిగారు. అమ్మమ్మబంధు వర్గంలో మంచి పేరు తెచ్చుకొంది. ఆమె మంచితనం వల్లనే ఆ యిల్లు ఆమాత్రం అలా వుందని ఆమెనే మెచ్చుకునేవారు ఇలా ఇద్దరికీ ఘర్షణతప్పలేదు. తాతగారు ఇంటగెలవలేక పోయారు. కానీ మనవరాలికి చాలా బాగా తెలుసును ఆయన వంటివాళ్లు కొందరయినా లేకపోతే కొత్తభావజాలం ఇంత విస్తృతంగా ప్రచారం అయి ఉండేదికాదు. ఆయన ఆదర్శం ఎప్పటికీ పాటించి తీరవలసిందే.

మరి అమ్మమ్మ?

గత నెలరోజులుగా ఆమె దుఃఖం, బాధ, కోపం అన్నీ చూస్తూనే వున్నది. తాతయ్య ఆదర్శం అమ్మమ్మ దఃఖం ఏంచెయ్యాలేం చెయ్యాలేం చెయ్యాలి? చివరికి ఒక ఆలోచన వచ్చింది, మనమరాలికి

"అమ్మమ్మా మరొక ఏడాదిలో నాచదువు పూర్తి చేసుకొని నీ దగ్గరే ఉంటాను ఈలోగా సెలవులు వచ్చినప్పుడు తప్పక నీదగ్గరకు వస్తాను పెళ్ళి నాయిష్టప్రకారమే చేసుకున్నా కూడా ఇక్కడే ఎంతచిన్నదయినా నాకు తగిన ఉద్యోగం చేసుకొంటాను తాతయ్య ఆదర్శాలకోసం పనిచేసినట్లుంటుంది. నీకు తోడుగా వున్నట్టూ వుంటుంది." అని అమ్మమ్మకు నచ్చచెప్పాలనిపించింది.

ఈ ఇల్లు కేవలం పుస్తకాల గుట్టకాదు. కొత్త ఆలోచనలకు కొత్త ఆచరణకు కూడా నిలయం. తాను తాతయ్యగారికంటే అమ్మమ్మకంటే రెండు తరాలు ముందుంది. కనుక ఈ ఇంటిని ముందుకే తీసుకువెళుతుంది.

ఈ ఆలోచనలతో మనుమరాలి లేత హృదయం తాత్కాలికంగా నైనా తేలిక పడింది.

లేచి లైటేవేసింది.

ఎదురుగా పుస్తకాల బీరువాల్లోంచి తాతయ్యగారు తనని అమ్మమ్మని చూస్తున్నట్లనిపించింది. ఆ అద్దాల్లో పుస్తకాలమధ్య తన ప్రతిబింబం నిటారుగా ధైర్యంగా నిలబడి కనబడింది.

ఇవి పుస్తకాల గుట్టలు కావు బీరువాలూ కావు నూతన భావ వీచికలు ప్రసరించే నవచైతన్య రూపాలు, సజీవ మూర్తులు. నిరంతరం నలుదిశలా ప్రసరించవలసిన ఆ వీచికల్లో తానూ ఒక వీచిక.

*రచన : 27-7-1996.*

*ప్రచురణ : విశాలాంధ్ర (ఆదివారం అనుబంధం), 15-9-1996.*